ఆషాఢమాసం..

అందమైన బోనం











అమ్మవారిని దర్శించుకున్న ఏఐసీసీ పబ్లిసిటీ విభాగం చైర్మన్ పవన్ ఖేరా, గండిమైసమ్మ అమ్మవారిని దర్శించుకున్న శ్రీగణేష్



లష్కర్‌లో బోనాలమ్మో..

కదిలొచ్చే మంకాలమ్మో

స్వచ్ఛంద సంస్థల సేవలు

ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి జాతర వచ్చిందంటే లక్షల మంది భక్తులు వస్తారు. జాతర సందర్భంగా ఒక వైపు ఆయా శాఖల అధికారులు ఏర్పాట్లు చేపట్టగా పలు సంఘాలకు చెందిన ప్రతినిధులు సేవలో మునిగిపోతారు. ఈ జాతరలో కూడా దక్కన్ మానవ సేవా సమితి, నల్లగుట్ట అభివద్ధి సంఘం, ఆర్య సమాజ్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, షీ టీమ్స్ మక్తల ఫౌండేషన్ తదితర సంఘాల ప్రతినిధులు భక్తులకు మంచినీళ్లు, ప్రసాదాలు తదితర సేవలు అందించారు.



ప్రభుత్వ విభాగాలు సైతం...

జలమండలి అధికారులు మంచినీళ్ల పంపిణీ చేశారు. డీఎంఅండ్‌హెచ్‌వో ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించారు. జీహెచ్ఎంసీ అధికారులు పారిశుద్ధ్య నిర్వహణ పనులు పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు చెత్తను, వ్యర్థాలను తొలగించారు. సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కళా వేదికలు ఏర్పాటు చేసి ప్రదర్శనలు ఇచ్చారు. బోనాల సంస్కృతి, సంప్రదాయాలు తెలిసేలా జానపద నృత్యాలు, ఆటపాటలతో అలరించారు.





రెజిమెంటల్‌బజార్‌లో గండిమైసమ్మ దేవాలయం వద్ద భక్తులు



ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర అంగరంగ వైభవంగా జరిగింది. సికింద్రాబాద్‌లో ఎటు చూసినా జాతర సందడి కనిపించింది. మహిళలు బోనాలెత్తుకుని అమ్మవారికి సమర్పించారు. నగరంతో పాటు రెండు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం కొద్దిగా భక్తులు సంఖ్య తక్కువగా ఉండగా మధ్యాహ్నం తర్వాత భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. భక్తులతో సికింద్రాబాద్ పురవీధులు నిండి పోయాయి. ఎటు చూసినా భక్తుల కోలాహలం కనిపించింది.

– రాంగోపాల్‌పేట్



అమ్మవారిని దర్శించుకున్న కార్పొరేటర్ చీర సుచిత్ర



బోనం సమర్పిస్తున్న కార్పొరేటర్ కొంతం దీపిక



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న క్రిశాంక్

లష్కర్‌లోని 40 ఆలయాల్లో బోనాల శోభ..

ఉజ్జయినీ మహంకాళి అమ్మవారితో పాటు సికింద్రాబాద్‌లో 40 దేవాలయాల్లో ఆదివారం బోనాల ఉత్సవాలు జరిగాయి. ఉదయం నుంచి రాత్రి వరకు ఆయా దేవాలయాల వద్ద భక్తుల సందడి కనిపింది. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు బారులు తీరారు. రెజిమెంటల్‌బజార్‌లోని గండి మైసమ్మ, తుల్కలమ్మ, సెకండ్‌బజార్‌లోని ముత్యాలమ్మలతో పాటు కళాసీగూడ, శివాజీనగర్, మోండా, రాణిగంజ్ ప్రాంతాల్లోని దేవాలయాల్లో అమ్మవారి బోనాల ఉత్సవాలు ఎంతో వైభవంగా నిర్వహించారు.



క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: బేగంపేట, లోధా, మైత్రీవనం, ఆల్విన్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ కిషోర్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎల్లమ్మ టెంపుల్ ఏరియా, బల్కంపేట్, సాయిబాబా టెంపుల్, రేణుకానగర్, సనత్‌నగర్ ఇండస్ట్రీయల్ ఏరియా, అల్లావుద్దీన్ కోఠి, లిక్కర్ కంపెనీ, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు గాయత్రీనగర్, సత్యం థియేటర్, మెయిన్‌రోడ్డు, బ్లూ ఫాక్స్, ప్రైమ్ హాస్పటల్, జెక్‌కాలనీ, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్, సెయింట్ థెరిస్సా హాస్పటల్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాటా 75, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 45, పచ్చిమిర్చి 90, బజ్జీమిర్చి 80, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 45, పందిరి బీర 28, క్యాబేజీ 15, క్యారెట్ 45, దొండ 23, గుండుబీన్స్ 85, గింజ చిక్కుడు 65, గోకరకాయ 28, కీర 23, దోసకాయ 28, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 21, చామగడ్డ 35, మొరంగడ్డ 23, కందగడ్డ 35, సొరకాయ 15, పొట్లకాయ 18, అరటికాయ 12, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

సనత్‌నగర్: పార్థివ్ లంగ్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో సనత్‌నగర్ జెక్‌కాలనీ మొదటి వీధిలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరం ద్వారా డాక్టర్ మౌనిక ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది సుమారు 150 మందికి మధుమేహం, గుండె, మెదడు, మూత్రపిండాలు, నరాలు, కళ్లకు సంబంధించిన పరీక్షలను చేశారు. అదేవిధంగా రక్త పరీక్షలైన పాస్ట్, పోస్ట్ బ్లడ్ షుగర్, కంప్లీట్ బ్లడ్ పిక్చర్, లిపిడ్ ప్రొఫైల్, క్రియాటీన్ యూరిన్, మైక్రో అల్బుమిన్, బీఎంఐ తదితర పరీక్షలను ఉచితంగా నిర్వహించడంతో పాటు వైద్య సలహాలను అందించారు.

ఏపీ తరహాలో యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

అమీర్‌పేట. ఆంధ్రప్రదేశ్‌లో మాదిరిగా తెలంగాణ రాష్ట్రంలో 20 శాతంగా ఉన్న యాదవులకు యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి ఏటా రూ.10వేల కోట్ల నిధులు కేటాయించాలని జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు మేకల రాములు యాదవ్ డిమాండ్ చేశారు. యాదవ సంఘం రాష్ట్ర యువత అధ్యక్షుడు శెట్టి వంశీమోహన్ సన్మాన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. డిమాండ్ల సాధన కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వచ్చే నెల 8వ తేదీన ఇందిరాపార్కు వద్ద వేలాది మందితో కలిసి యాదవ గర్జన నిర్వహిస్తామని పేర్కొన్నారు.

◆ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పోరాడి యాదవ కార్పొరేషన్‌ను సాధించుకున్నామని చెప్పారు. కార్పొరేషన్ ఏర్పాటు ద్వారా చిన్న చిన్న పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవడంతో పాటు ఉన్నత విద్యను అభ్యసించేందుకు విదేశాలకు వెళ్లే పిల్లలకు ఆర్థిక సహాయం అందుతుందని వివరించారు.అదే విధంగా రెండో విడత గొర్రెల పంపిణి కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఎస్ఎన్‌టీ రిజర్వేషన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన టికెట్లు ఇచ్చే రాజకీయ పార్టీలకే తమ మద్దత్తు ఉంటుందని స్పష్టం చేశారు. గుడిగె శ్రీనివాస్‌యాదవ్, సత్యనారాయణయాదవ్ పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం



ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు

బౌద్ధనగర్: బీజేపీ ప్రభుత్వం భారత దేశాన్ని ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక శక్తి దేశంగా మార్చిందని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవిప్రసాద్ గౌడ్ అన్నారు. ప్రధాని మోదీ సారథ్యంలో ప్రపంచంలోనే భారతదేశం దూసుకుపోతున్న సందర్భంగా ఆదివారం వారాసిగూడ చౌరస్తాలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం, రవిప్రసాద్‌గౌడ్ మాట్లాడుతూ.. లక్షల కోట్తో తెలంగాణ రాష్ట్రంలో పలు ప్రాజెక్టు పనులకు మేక్ ఇన్ ఇండియాలో బాగంగా శంకుస్థాపన చేశారన్నారు. అందులో భాగంగా వరంగల్‌లో రూ. 6,100 కోట్లతో రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారన్నారు. దీని మూలంగా వేలాది కుటుంబాలకు ఉపాధి కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్, నేతలు నాగేశ్వర్ రెడ్డి, వీఎస్ రాజు, కుమార్, బైరి సురేష్, ఓములు, నాగేష్, సత్యనారాయణ, మల్లేశ్వరరావు, బట్టల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీకే పట్టం కడతారు

కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ

రసూల్‌పురా: బీజేపీ ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యులు జే. రామకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం బొల్లారం బంజారానగర్‌లో భూగర్భ డ్రైనేజీ పైపులైను పనులను రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కాంగ్రెస్, ప్రస్తుత బీఆర్ఎస్ ప్రభుత్వాలు కంటోన్మెంట్‌పై సవతి తల్లి ప్రేమ కనబర్చడంతో అభివృద్ధి జరగక ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజల్లో మార్పు వచ్చిందని వచ్చే ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టబెడుతారని అన్నారు. తాను బీజేపీ నుంచి బోర్డు నామినేటెడ్ సభ్యుడిగా బోర్డు పరిధిలో అన్ని వార్డుల్లోని బస్తీల్లో కాలనీల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు యుగందర్, రామ్‌రెడ్డి, విజయ్ అంద్ర్యూస్, వార్డు అధ్యక్షుడు కిరణ్‌కుమార్, శ్రీకాంత్ జైనపల్లి తదితరులు పాల్గొన్నారు.



భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న రామకృష్ణ

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

అడ్డగుట్ట: పర్యావరణ పరిరక్షణకు అందరూ విధిగా మొక్కలు నాటాలని సత్యసాయి సేవా సంస్థ మారేడుపల్లి మండల కోఆర్డినేటర్ ఎం. గోపాల్ అన్నారు. ఆదివారం తుకారాంగేట్‌లోని గణేష్ టెంపుల్ ఆవరణలో సత్యసాయి సేవా సంస్థ ప్రతినిధులు విద్యావాహిణి స్కూల్‌కు చెందిన బాల వికాస్ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం, పలువురు మాట్లాడుతూ.. నేటి కాలుష్య నగరంలో పర్యావరణ పరిరక్షణకు అందరూ తమవంతు కృషి చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. అందువల్ల ప్రతీ ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గణేష్ టెంపుల్ సెక్రటరీ శివకుమార్, విద్యావాహిణి స్కూల్ కరస్పాండెంట్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినోభానగర్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలోని వినోభానగర్ సంక్షేమ సంఘం 2023–2025 సంవత్సరానికి నూతన కమిటీ ఎన్నికలు జరిగాయి. పెన్ను గుర్తు అభ్యర్థులు ఘన విజయం సాధించారు. ఆదివారం అధ్యక్షుడిగా నాగునూరి స్వామి, ఉపాధ్యక్షులుగా కిరణ్‌కుమార్, రాజు తదితరులతో ఎన్నికల అధికారులు ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ వినోభానగర్ అభివృద్ధికి పాటుపడతామన్నారు. తమను గెలిపించిన వినోభానగర్ వాసులందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ

సనత్‌నగర్: పర్యావరణాన్ని కాపాడుకుందాం.. భవిష్యత్ తరాలను నిర్మించుకుందాం.. అంటూ మాతృశ్రీ స్టడీ సర్కిల్ విద్యార్థులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. బెటర్ ఎన్విరాన్‌మెంట్-బెటర్ టుమారో, ట్రీస్ గివ్ పీస్ టు ద సోల్ వంటి విలువైన సందేశాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను చాటిచెప్పారు.ఈ సందర్భంగా స్టడీ సర్కిల్ డైరెక్టర్ కన్నూరి క్రాంతికుమార్ మాట్లాడుతూ... పర్యావరణ కాపాడడం ద్వారా మనల్ని మనం కాపాడుకున్నవాళ్లం అవుతామన్నారు. చెట్లు విరివిగా పెంచాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ టీచర్స్ కన్నూరి కృష్ణప్రియ, శ్రీదేవి, నిఖిత తదితరులు పాల్గొన్నారు.

చిన్న కమేళాలో సమస్యలు పరిష్కరిస్తా

రసూల్‌పురా: కంటోన్మెంట్ పరిధిలోని చిన్న కమేళ బస్తీవాసుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం సహకారంతో దశలవారీగా పరిష్కరించనున్నట్లు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిషాంక్ హామీచ్చారు. 16వ బస్తీనిద్ర కార్యక్రమంలో భాగంగా కంటోన్మెంట్ తిరుమలగిరి చిన్న కమేళలో శనివారం రాత్రి క్రిషాంక్ బస్తీనిద్ర చేశారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు డ్రైనేజీ, రోడ్ల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు బస్తీవాసులు క్రిషాంక్‌కు ఫిర్యాదు చేశారు. కంటోన్మెంట్ బోర్డు అధికారుల నిర్లక్ష్యం కారణంగా బస్తీలో సమస్యలు నెలకొని ఉన్నాయని బోర్డు పరిధిలోని సివిలియన్ ప్రాంతాలను రాష్ట్రానికి అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని త్వరలో వీలిన ప్రక్రియ పూర్తయితే సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా బస్తీవాసులతో కలసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యులు పి.శ్యాంకుమార్, జాన్. వేణు, సరిత, విజయ్‌కుమార్, సాయి. రఘు, రాజు, తదితరులు పాల్గొన్నారు.



బస్తీ నిద్ర కార్యక్రమంలో భాగంగా చిన్నకమేళలో స్థానికులతో మాట్లాడుతున్న క్రిషాంక్

రౌడీషీటర్లు సత్‌ప్రవర్తనతో మెలగాలి

ఈస్ట్‌జోన్ డీసీపీ సునీల్ దత్

బౌద్ధనగర్: రౌడీషీటర్లు సత్ ప్రవర్తనతో మెలగాలని నేరాలకు పాల్పడితే ఎట్టిపరిస్థితుల్లోనే విడిచిపెట్టేది లేదని ఈస్ట్‌జోన్ డీసీపీ సునీల్ దత్ హెచ్చరించారు. ఆదివారం ఈస్ట్‌జోన్ డీసీపీ సునీల్ దత్ వారాసిగూడ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. అనంతరం, పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ సునీల్ దత్ మాట్లాడుతూ.. రౌడీషీటర్లు ఎటువంటి క్రిమినల్ యాక్టివిటీస్‌లో ఇన్‌వాల్వ్ అయినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా పండుగల సమయాల్లో జాగ్రత్తగా ఉండాలన్నారు. అనవసరమైన గొడవల్లో తలదూర్చకూడదని హెచ్చరించారు. సత్‌ప్రవర్తనతో మెలుగుతూ మంచి మార్గంలో నడవాలని సూచించారు. ఈ సమావేశంలో ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ శంకర్‌లు పాల్గొన్నారు. రౌడీషీటర్లు సత్‌ప్రవర్తనతో మెలగాలి



రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న డీసీపీ సునీల్ దత్

దోమల వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు

లాలాపేట: దోమల బారిన పడకుండా ప్రజలందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలనీ జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి సూచిస్తున్నారు. ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో రూపొందిచిన ప్రతి ఆదివారం ఉదయం 10 గంటలకు 10 నిమిషాలు పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలనీ తెలిపే వాల్‌పోస్టర్‌ను ఆదివారం తార్నాకలోని డిప్యూటీ మేయర్ ఆవిష్కరించారు. దోమల వ్యాప్తికి కారణం అయ్యే పాడైన వస్తువులను, చెత్త చెదారాన్ని ఇంటి పరిసరాల్లో ఉండకుండా తొలగించాలన్నారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్‌రెడ్డి, ఎంటమాలజీ ఎస్ఈ దుర్గాప్రసాద్,ఏఈ శ్రీనివాస్‌రెడ్డి, సూపర్‌వైజర్ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ మేయర్ ఎం. శ్రీలత శోభన్‌రెడ్డి